
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 26 జూలై 2025 | 5





మండపేట పరిసరాల్లో శుక్రవారం వర్షం కురుస్తున్న దృశ్యం

వాయుగుండం హెచ్చరికలతో అప్రమత్తం

- రామచంద్రపురంలో అత్యధిక వర్షపాతం.. అత్యల్పం అయినవిల్లి
- చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరిక

అమలాపురం, జూలై25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తీరాలను ఈ వాయుగుండం తుఫానుగా మారి తాకే అవకాశం ఉన్న దృష్ట్యా కోస్తా జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిం ది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో శుక్రవారం నెలకొన్న వా తావరణ పరిస్థితులపై విపత్తు నిర్వహణ సంస్థల ఎండీ ప్రకార్జైన్ సమీక్షించారు. ఆదివారం వరకు కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరం వెంబడి 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండడంతో సముద్రంలో అలజడి ఉంటుందని, తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడే అవకాశం ఉన్న దృష్ట్యా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు, ఫ్లాష్ ఫ్లడ్స్ సంభవించే ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా చెదురుమదురు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వాతావరణం చలిగా ఉంది. ఈదురుగాలులతో కూడిన వర్షపు చినుకులు కురుస్తున్నాయి. కాగా జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కురిసిన వర్షపాతం ఇలా ఉంది. అత్యధికంగా 18.8 మిల్లీమీటర్ల వర్షపాతం రామచంద్రపురంలో నమోదైంది. అత్యల్పంగా 1.6 మిల్లీమీటర్లు అయినవిల్లిలో రికార్డయింది. ఆత్రేయపురంలో 8.8, మండపేట 15, రాయవరం 9.6, ఆలమూరు 5.2, రావులపాలెం 7.4, కొత్తపేట 6.2, కపిలేశ్వరపురం 3.2, కె.గంగవరం 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఐ.పోలవరం, ముమ్మిడివరంలో 3.2 చొప్పున, పి.గన్నవరం 4.8, అంబాజీపేట 6.2, మామిడికుదురు 7.6, రాజోలు 13.8, మలికిపురం 6.4, సఖినేటిపల్లి 3.6, అల్లవరం 5.4, అమలాపురం 3.2, ఉప్పలగుప్తం 6.8, కాట్రేనికోనలో 2.6 వర్షపాతం, జిల్లాలో సగటు వర్షపాతం 6.7 రికార్డయింది.



ఒడ్డుకు చేరిన బోట్లు

అంతర్వేది, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా సఖినేటిపల్లి మండలం మినీ ఫిషింగ్ హార్బర్‌కు కొన్ని సోనా బోట్లు చేరుకున్నాయి. సుమారు 50 బోట్లు హార్బర్‌కు చేరుకున్నాయని స్థానికులు తెలిపారు. అధిక వర్షాలకు అల్పపీడనం కారణంగా మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు.

కూలుతుందో.. ఏమో!

ప్రమాదంలో కాకినాడ పెద్దాసుపత్రి



- స్లాబ్‌లకు లీకులు
- పాత భవనాలతో భయం
- జేఎన్‌టీయూ ఇంజనీర్ల పరిశీలన
- తొలగించాలని నివేదిక
- కొత్త నిర్మాణాలకు రూ.500 కోట్లు
- ప్రభుత్వానికి ప్రతిపాదలు
- పవన్ స్పందించాలని డిమాండ్

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పేదలకు పెద్ద దిక్కయిన కాకినాడ జీజీహెచ్ దీనంగా మారింది. వేలాది మంది రోగులకు సేవలందిస్తోన్న విభాగాలు బిక్కుబిక్కుమంటున్నాయి. పాడుబడిన భవనాలు, ఎప్పుడు కూలుతాయో తెలియని బ్లాకులు రోగులు, వైద్యులను నిరంతరం భయపెడుతున్నాయి. అసలే వర్షాకాలం ఆరంభమవడంతో లీకవుతున్న శ్లాబ్‌లు, తడిచిపోతున్న రికార్డులతో జీజీహెచ్ ప్రమాదకరంగా మారింది. ఆసుపత్రికి కొత్త భవనాల నిర్మాణం అత్యవసరమైనా నిధుల్లేక ఈసురోమంటోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పేదలకు పెద్దదిక్కు కాకినాడ జీజీహెచ్. ఏ పెద్ద అనారోగ్యం వచ్చినా వారంతా వచ్చేది ఇక్కడికే. వందలాది మంది ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లతో ఈ ప్రభుత్వాసుపత్రి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలకమైన కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు కూలుతాయో అన్నట్టు మారాయి. అసలే వర్షాల నేపథ్యంలో ఎక్కడికక్కడ అనేక విభాగాల్లో గోడల దగ్గర నుంచి శ్లాబ్‌ల వరకు వర్షపునీరు లీకవుతోంది. దీంతో ఎప్పుడు ఏమవుతుందోననే ఆందోళన అందరినీ వెన్నాడుతోంది.

నిధులెప్పుడిస్తారో..

గతేడాది కాకినాడ జేఎన్టీయూ ఇంజనీర్లు ఈ భవనాలన్నింటిని పరిశీలించారు. వీటిలో అనేక భవనాలు బలహీనంగా ఉన్నట్టు గుర్తించారు. అనేక బ్లాకులు తొలగించాల్సిందేనని ఇప్పటికే నివేదిక ఇచ్చారు. పాడైన భవనాలను తొలగించి వాటి స్థానంలో జీప్లస్ 8 విధానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.500 కోట్ల వరకు ఖర్చవుతుందని తేల్చారు. ఈమేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి గతేడాది నివేదిక పంపారు. కొత్త భవనాల్లో 600 పడకలు ఉండేలా ప్రణాళికలు రూపకల్పన చేశారు. నిధుల విడుదలకు కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు గుర్తుచేసినా ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్టే చెబుతున్నారు. జీజీహెచ్‌కు కొత్త భవనాలు ఎప్పుడు సమకూరుతాయో తెలియని పరిస్థితి. జిల్లా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి నిధులు విడుదలపై దృష్టిసారించాల్సి ఉంది.

రోజూ వేలాదిగా రోగులు..

జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగానికి రోజూ రెండు వేలమంది వరకు రోగులు వస్తారు. ఇన్‌పేషెంట్ విభాగంలో 1,600 నుంచి 1,800 వరకు రోగులు ఉంటారు. నిత్యం వేలాది మంది రోగులతో ఆసుపత్రి కిటకిటలాడుతుంటుంది. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పిడియాట్రిక్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ వంటి ఎన్నో విభాగాల్లో రోగులకు కావాల్సిన సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఎక్స్‌రేలు అందుబాటులో ఉంటాయి. ఐసీయూలతోపాటు యాక్టివ్ మెడికల్ కేర్ యూనిట్లు, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్లు నిరంతరం పనిచేస్తాయి. 24 గంటలూ ఇక్కడ చికిత్స అందుతుంది. అటు జీజీహెచ్‌కు అనుబంధంగా రంగరాయ మెడికల్ కాలేజీ నుంచి వందలాది మంది వైద్యులు, నర్సులు జీజీహెచ్ విధుల్లో ఉంటారు. ఏ అనారోగ్యం వచ్చినా, ప్రమాదాలు జరిగినా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక వేలాదిమంది ఇక్కడకే శస్త్రచికిత్సకు వస్తారు. ప్రధానంగా సోమవారం రోజైతే ఓపీ విభాగాలు కిక్కిరిసిపోతాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నుంచి రిఫర్ కేసుల సంఖ్య ప్రతి రోజూ ఉంటుంది. ఏ పెద్ద ప్రమాదం జరిగినా ఆయా కేసులను వెంటనే కాకినాడకు రిఫర్ చేసేస్తారు.

బాబోయ్.. ఆ బ్లాకులు..

ఆసుపత్రిలో అనేక భవనాలు దాదాపు 50 నుంచి 60 ఏళ్లు దాటిపోయాయి. దీంతో అనేక బ్లాకులు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టున్నాయి. ప్రధానంగా అడ్మినిస్ట్రేషన్ భవనం రెండో అంతస్తులో శ్లాబ్‌ల నుంచి వర్షం నీరు లీకవడం వల్ల ఎంఆర్‌డీ సెక్షన్‌లో మెడికల్ రికార్డులన్నీ పాడవుతున్నాయి. పైగా స్లాబు పెచ్చులూడిపోవడంతో కొన్ని ప్రత్యేక వార్డులను పూర్తిగా మూసివేశారు. ఇదే భవనంలో ఈఎన్‌టీ, డెంటల్ విభాగాలు, ఓపీ జరిగే విభాగాల్లో షెడ్లు వర్షాలకు పడిపోయాయి. సర్జికల్‌వార్డు, ఆర్థోపెడిక్, అడ్మినిస్ట్రేషన్ భవనం, మెడికల్ వార్డు భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. జీప్లస్3 విధానంలో ఉన్న ఈ భవనాలన్నీ కూల్చాల్సిన పరిస్థితి ఉంది. వాస్తవానికి ఈ పాత భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. గత వైసీపీ సర్కారు అయితే కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించేసింది. కానీ ఆసుపత్రి భవనాలు మాత్రం నిర్మించలేదు. పలుసార్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనల్లో పాత భవనాల నిర్మాణాలకు నిధులిస్తున్నట్టు చెప్పినా కనీసం చిల్లిగవ్వ ఇవ్వలేదు.



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు



అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పక్కన జేసీ, డీఆర్వో

నెలాఖరుకు బంగారు కుటుంబాల డేటా అప్‌లోడ్ చేయాలి : కలెక్టర్

అమలాపురం, జూలై25(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పీ-4 రీవాల్యూయేషన్ గ్రామసభలు, సర్వేను పూర్తిచేసి అర్హుల డేటాను ఈ నెలాఖరుకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా డివిజన్, మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో పీ4 రీవాల్యూయేషన్‌పై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సర్వేకు సంబంధించి రీవాల్యూయేషన్, గ్రామసభల ద్వారా బంగారు కుటుంబాల అవసరాన్ని గుర్తించి సూచికలు, ఎలక్ట్రానిక్ ట్రాకింగ్ పెర్ఫార్మెన్స్ సిస్టమ్ (ఈటీపీఎస్) వివరాలు నమోదు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఆధునిక, సాంకేతికత పరిపాలనా విధానాన్ని జోడిస్తూ ప్రభుత్వం విధివిధానాలు రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 65 వేల మంది బంగారు కుటుంబాలు ఉన్నాయని, గ్రామసభల ద్వారా అర్హతలు కలిగిన వారిని గుర్తించి వారి అవసరాలు తెలుసుకుని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సందర్శించి ఈ ప్రక్రియను పరిశీలించాలన్నారు. గత రెండు నెలల కిందట చేసిన సర్వే డేటాను డౌన్లోడ్ చేసుకుని వారిలో వివిధ కారణాల వల్ల మరణించిన, అనర్హులను, అంగీకారం లేనివారిని గుర్తించి వారిని తొలగించి అర్హులకు న్యాయం చేయాల్సిందిగా కలెక్టర్ సూచించారు. సచివాలయ సిబ్బందికి పోర్టల్ ద్వారా బంగారు కుటుబాల అవసరాల డేటా ఎంట్రీ విధివిధానాలపై ఎంపీడీవోలు సిబ్బందికి అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లా స్థాయిలో పారామీటర్ ఇండికేటర్స్ 139 ప్రభుత్వం నిర్దేశించిందని, ఆ ప్రకారం స్వర్ణాంధ్ర పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గం నియామకం



జిల్లా కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ

అమలాపురం, జూలై25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ శుక్రవారం విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. జిల్లాలో ఎనిమిదిమంది బీజేపీ ఉపాధ్యక్షులుగాను, ముగ్గురు జనరల్ సెక్రటరీలుగాను, ఐదుగురిని జిల్లా కార్యదర్శులుగాను, ఒకరిని ట్రెజరర్‌గా నియమించారు. అదేవిధంగా సోషల్ మీడియా కన్వీనర్‌గా ఒకరిని, ఐటీ కన్వీనర్‌గా ఒకరిని, కార్యవర్గ సభ్యులుగా 26 మందిని నియమించినట్టు వెల్లడించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులుగా గనిశెట్టి వెంకటేశ్వరరావు, సీహెచ్ జానకీరాం బాబు, కొత్తపల్లి శ్రీదేవి, మాలే శ్రీనివాసనగేష్, చిలకమర్రి కస్తూరి, సీహెచ్ త్రినాథరావు, అడపా శ్రీనివాసరావులను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా సలాది వీరబాబు, చీకురుమెల్లి శ్రీనివాసరావు, కొప్పాడి దత్తాత్రేయ, కార్యదర్శులుగా నడింపల్లి సుబ్బరాజు, మోకా ఆదిలక్ష్మి, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, రేకాడి వర్మ, చీకురుమెల్లి వెంకటేశ్వరరావులు నియమితులయ్యారు. బీజేపీ కోశాధికారి గ్రంధి సూర్యనారాయణ(నానాజీ), బీజేపీ సోషల్‌మీడియా కన్వీనర్‌గా రొక్కాల సత్యబాబు, బీజేపీ ఐటీ కన్వీనర్‌గా చంద్రు భార్గవసాయిరామ్‌చౌదరిలను నియమించారు. జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులుగా మొత్తం 26 మందిని నియమించినట్టు తెలిపారు.

వంట గ్యాస్ కష్టాలను అధిగమిస్తూ..

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు .. పైలెట్ ప్రాజెక్టుగా 274 కేంద్రాలకు పంపిణీ





వన్నెచింతలపూడి అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం ప్రభుత్వం సరఫరా చేసిన ఇండక్షన్ స్టవ్‌తోపాటు వంట పాత్రలను గ్రామ సర్పంచ్ నక్కా రాజారత్ననాగవాణి పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి అలేఖ్య, సొసైటీ చైర్మన్ నడింపల్లి వెంకటరామరాజు, ఉపసర్పంచ్ యర్రంశెట్టి వీరభద్రరావు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వంట గ్యాస్ కష్టాలు తీరనున్నాయి. వంట గ్యాస్ కోసం ఎదురుచూడకుండా ఉండేందుకు తొలివిడతలో ఎంపిక చేయబడ్డ అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, ఇతర వంట సామగ్రి అందించే ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద తొలి విడతలో 274 అంగన్ కేంద్రాలకు విద్యుత్ సాయంతో పనిచేసే ఇండక్షన్ స్టవ్‌లు అందిస్తున్నారు. వాటితోపాటు ఆయా కేంద్రాలకు కుక్కర్లు, కాపర్‌కోటెడ్ వంటపాత్రలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటి వరకు ఏజెన్సీల ద్వారా గానీ, ప్రైవేటు వ్యక్తులు గానీ వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసేవారు. వారికి ప్రభుత్వం నేరుగా నగదు జమచేసేది. నగదు చెల్లింపులో బకాయి పడినా, వంట మధ్యలో గ్యాస్ సిలిండర్ అయిపోయినా అంగన్‌వాడీలు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. వీటన్నింటినీ అధిగమిస్తూ విద్యుత్‌తో పనిచేసే ఇండక్షన్ స్టవ్‌లను అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తుండడంతో అంగన్‌వాడీల ఆనందానికి అవధుల్లేవు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శాంతకుమారి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో తొలి విడత కింద 274 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంటపాత్రలు అందిస్తున్నామని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో వాటిని అందిస్తున్నామని, వీటి వినియోగంపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తామన్నారు.



మంత్రికి ఎమ్మెల్యే వేగుళ్ల స్వాగతం

నేడు మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటన

మండపేట, జూలై25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం మండపేట నియోజకవర్గంలోని రాయవరం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈమేరకు మంత్రి శుక్రవారం రాత్రి మండపేట చేరుకున్నారు.

తొలగింపా.. సర్దుబాటా..

- ఆక్రమణల తొలగింపులో రాజకీయ పితలాటకం
- కొబ్బరి చెట్లు పోకూడదు.. తవ్వకాలు జరగాలి
- సందిగ్ధంలో గొరగనమూడి డ్రెయిన్ తవ్వకం పనులు
- ఆక్రమణలు తొలగిస్తామంటున్న ఇరిగేషన్ అధికారులు
- నేటికీ ప్రారంభం కాని డ్రెయిన్ పనులు



గొరగనమూడి డ్రెయిన్ గట్లను ఆక్రమించి పెంచుకున్న కొబ్బరిచెట్లు

ఉప్పలగుప్తం, జూలై25(ఆంధ్రజ్యోతి): గొరగనమూడి డ్రెయిన్ తవ్వాలంటూ గత ఐదేళ్లుగా రైతులు ఆందోళన చేస్తున్నారు. డ్రెయిన్ ఆయకట్టు పొలాల్లో సార్వాకు స్వస్తిపలికారు. ఎట్టకేలకు కూటమి పాలకులు గొరగనమూడికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.66 లక్షలు మంజూరుచేశారు. అనుకున్న సమయానికి పనులు ప్రారంభించలేదంటూ రైతులు కాంట్రాక్టర్‌పై విరుచుకుపడ్డారు. జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వద్దకు ఈ సమస్యను తీసుకెళ్లారు. తీరా పనులు ప్రారంభిద్దామనుకునేసరికి రాజకీయం మొదలైంది. రెండు వర్గాలుగా రైతులు ఆక్రమణలపై వ్యాఖ్యానిస్తున్నారు. ఒక వర్గం ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని, మరో వర్గం మట్టితీసి రెండువైపులా గట్లపై వేస్తే సరిపోతుందని ఇంజనీరింగు నిపుణులకు సలహాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో తవ్వకం పనులకు ఆదిలోనే ఫుల్‌స్టాప్ పడింది. ఈ క్రమంలో అధికారులు మాత్రం అంచనాలకు అనుగుణంగానే పనులు చేపట్టాలన్న నిర్ణయంతో ముందడుగు వేస్తున్నారు. డ్రెయిన్‌కు ఇరువైపులా ఆక్రమణలపై సర్వే ప్రారంభించారు. పూర్తి కాగానే పనులు ప్రారంభించేందుకు ఇంజనీరింగ్ విభాగం సన్నద్ధమవుతోంది. ఉప్పలగుప్తం మండలంలోని కూనవరం మేజర్ డ్రెయిన్‌లో కలిసే గొరగనమూడి డ్రెయిన్ 10.20 కి.మీ మేర రెండు మండల్లాలో విస్తరించి ఉంది. ప్రారంభంలో ఈ డ్రెయిన్ 1.20 మీటర్ల వెడల్పు, చివరలో 8.8కిమీ వెడల్పు ఉంటుంది. ఆరువేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ డ్రెయిన్‌కు ఇరువైపుల గట్లను ఆక్రమించి కొబ్బరి చెట్లు పెంచారు. ఆక్వా చెరువుల కారణంగా పోయినవి పోగా, ప్రస్తుతం 1000-1500 వరకు కొబ్బరి చెట్లు డ్రెయిన్ గట్లపై ఉన్నాయి. ఇప్పటివరకు డ్రెయిన్ తవ్వకపోతే సాగు కష్టమన్న కొందరు రైతులు ఆక్రమణల తొలగింపు తప్పదని అధికారులు స్పష్టీకరించడంతో సందిగ్ధంలో పడ్డారు. తమ కొబ్బరిచెట్లు పోతాయనే కారణంగా చెట్లు పోకుండా తవ్వకాలు జరిపించాలంటూ ఉప్పలగుప్తం నీటి పంపిణీ సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబును ఆశ్రయించారు. మరికొందరు డ్రెయిన్స్ అధికారులను కలిసి డ్రెయిన్‌లో మట్టి తీసి ఇరువైపుల గట్ల మీద వేస్తే సరిపోతుందని సలహాలిస్తున్నారు. డ్రెయిన్ తవ్వితే ఉప్పునీరు పొలాల్లోకి ఎగదన్నే ప్రమాదముందని మరికొందరు కొత్త వాదన వినిపిస్తున్నారు. ఈ పరిస్థితిలో అసలు డ్రెయిన్ తవ్వకం పనులు ప్రారంభిస్తారా లేదా అని సన్న, చిన్నకారు రైతులు చర్చించుకుంటున్నారు. ఈనెల 15న తవ్వకం పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డ్రెయిన్స్ ఎస్ఈ గోపీనాథ్ ప్రారంభ పూజ చేశారు. తమ కొబ్బరిచెట్ల కోసం తవ్వకం పనులను అడ్డుకునేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా, లేక అధికారులు తమ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతారా అన్నది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

ఆక్రమణలు తొలగించి డ్రెయిన్ ఆధునికీకరణ పనులు చేస్తాం

గొరగనమూడి డ్రెయిన్ ఆధునికీకరణ కోసం ఐదేళ్లుగా ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. రంగరాజుకోడు డ్రెయిన్ మాదిరిగా ఆక్రమణలు తొలగించి సుదీర్ఘ కాలం ముంపు సమస్య నుంచి పొలాలను రక్షించాలనే లక్ష్యంతో అంచనాలు రూపొందించాం. తీరా నిధులు మంజూరయ్యాక ఆక్రమణలు తొలగించకుండా పనులు చేయాలంటే కుదిరేపని కాదు. అంచనాల ప్రాతిపదికగా నిధులు మంజూరవుతాయి. ఆ ప్రకారమే పనులు చేపట్టాలి. అందుకే ముందుగా ఆక్రమణల సర్వే కార్యక్రమం ప్రారంభించాం. ఆ నివేదిక ప్రకారం ఆక్రమణలు తొలగించి, డ్రెయిన్ తవ్వకం జరుగుతుంది. ఇందులో ఎవరి జోక్యం ఉండబోదు. రైతులకు న్యాయం జరగాలన్నదే అందరి ఆకాంక్ష. పనులు వెంటనే ప్రారంభించేందుకు యంత్రాలు సిద్ధంగా ఉన్నాయి.

- కిశోర్‌కుమార్, డ్రెయిన్స్ డీఈఈ



ఆర్చ్ బ్రిడ్జికి...

రూ.70 కోట్లతో మరమ్మతులు

మూడేళ్లపాటు పనులు... రైళ్ల వేగ పరిమితి పెంపు

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి తోరణాలు కట్టినట్టుగా కనిపించే రైల్వే ఆర్చ్ బ్రిడ్జికి మరమ్మతులు మొదలుపెట్టారు. ఆర్చ్‌లకు ఉన్న దీనా హ్యాంగర్స్‌లోని వైర్లను మారుస్తున్నారు. దాదాపు రూ.70 కోట్లతో జరుగుతున్న పనులు పూర్తి కావడానికి మూడేళ్ల సమయం పడుతుంది. గతంలో దీనా హ్యాంగర్ సమస్య రాగా సుమారు రూ.కోటితో మరమ్మతులు చేశారు. ప్రతి రోజూ ఈ వంతెన మీదుగా 50 ప్రయాణికుల రైళ్లు, 40 గూడ్స్ రైళ్లు





ఆర్చ్ బ్రిడ్జి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ప్రయాణిస్తాయి. ప్రయాణికుల రైళ్లకు గంటకు 80 కిలోమీటర్లు, గూడ్స్ రైళ్లకు 60 కిలోమీటర్లు వేగ పరిమితి ఉంది. అయితే పనుల కారణంగా ఆ వేగాన్ని 30 కిలో మీటర్లకు తగ్గించారు. ఈ బ్రిడ్జిపై గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు దూసుకుపోయే విధంగా డిజైన్ చేసినా ఎప్పుడూ అంత వేగంతో వెళ్లలేదు.

● **ప్రత్యేకత ఇదీ**

గోదావరి నదిపై 1897లో తొలి రైల్వే బ్రిడ్జి నిర్మించారు. అది వందేళ్ల సేవలందించిన తర్వాత 1997లో మూసేశారు. దీనిని మూసి వేయడానికి ముందుగానే ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణం 1991లో మొదలైంది. 1997 మార్చి 12 నుంచి ఈ వంతెనపై రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఈ ఆర్చ్ బ్రిడ్జి చూడడానికి అద్భుతమైన నిర్మాణంగా కనిపిస్తున్నా దీనిలో గొప్ప ఇంజనీరింగ్ సాంకేతికత ఉంది. వాడుకలో ఆర్చ్ బ్రిడ్జి అని పిలుస్తున్నా దీని అసలు పేరు బౌస్ట్రింగ్-గర్డర్ బ్రిడ్జి. వంతెన నుంచి ఇనుప ఊచల మాదిరిగా కనిపించే వాటిని దీనా హ్యాంగర్లు అంటారు. ఇవి మొత్తం 600 ఉంటాయి. వీటిలో ఇనుమ తదితర లోహాలతో చేసిన వైర్లు ఉంటాయి. వాటిని బ్రిడ్జి నుంచి ఆర్చ్‌లకు అనుసంధానిస్తారు. రైలు వెళ్లే సమయంలో బ్రిడ్జిపై పడే భారం ఆ వైర్ల గుండా స్వేచ్ఛగా ప్రయాణించి ఆర్చ్‌లకు చేరుతుంది. అటు, ఇటు చివర్లకు చేరుకోవడం ద్వారా వెలుపలకు వెళ్లిపోతుంది. దీంతో బ్రిడ్జిపై రైలు వేగంగా వెళ్లే అవకాశం కలగడంతో పాటు బ్రిడ్జికి ఎలాంటి ఇబ్బందీ కలగదు.

ఇప్పుడేం చేస్తున్నారు?



ఆర్చ్‌లకు వేలాడుతున్నట్లుగా కనిపిస్తున్న దీనా హ్యాంగర్స్ లోపల వైర్లు ఉంటాయి. ఈ నిర్మాణాన్ని 25ఏళ్ల కాలానికి తగినట్టుగా డిజైన్ చేశారు. ఆ కాలం ముగిసిపోయింది. దీనా హ్యాంగర్ల లోపల ఉన్న వైర్లు ఉబ్బిపోవడంతో బయటకు కనిపిస్తున్న ఇనుప కవర్ పగిలిపోతోంది. అందువల్ల ఆ వైర్లను, బేరింగులను మార్చుచేసి, సాంకేతికతను కూడా భవిష్యత్తులో ఇబ్బంది రాని విధంగా జోడిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్పాన్ (స్తంభాలను) కూడా బాగా వెడల్పుగా నిర్మించారు. ఒక్కో స్పాన్ కనీసం 98 మీటర్లు ఉంటుంది. ఒకవేళ నాలుగో వంతెన నిర్మించా లన్నా ఇబ్బంది లేకుండా స్పాన్లలో కొంత భాగా న్ని ఖాళీగా వదిలిపెట్టారు. మనకు తోరణాల మాదిరిగా కనిపిస్తున్న ఆర్చ్‌లు మొత్తం 56 ఉన్నాయి. ఈ బ్రిడ్జి పొడవు 2.745 కిలోమీటర్లు.



రేపటి నుంచి ఏపీఈఏపీసెట్ తుది దశ వెబ్ కౌన్సెలింగ్

- కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు
- ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చు

జేఎన్టీయూకే, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 అడ్మిషన్లలో భాగంగా ఎంపీసీ విభాగం అభ్యర్థు లకు సంబంధించిన ఆన్‌లైన్ తుది దశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ఆదివారం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈఏపీ సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ జీ.గణేష్‌కుమార్ శుక్రవారం జారీ చేశారు. మొదటి దశలో సీటు పొందని, కేటాయించిన సీటులో అడ్మిషన్ తీసుకోని విద్యార్థులు తుది దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు నమోదు చేసుకునేందుకు అర్హులు. విద్యార్థికి ఏ ర్యాంకు వచ్చినా ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చని, ధ్రువపత్రాలను పరిశీలిస్తామని కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ (ఏపీటీ) సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రిన్సిపాల్ ఎన్.జనార్దన రావు తెలిపారు. ఈ నెల 7న ప్రారంభమైన ఈఏపీసెట్ తొలి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ముగియనుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సంబంధిత ఇంజనీరింగ్ కళాశాలల్లో తరగతులను ఆగస్టు 4న ప్రారంభించనున్నారు.

● ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 24 ప్రైవేట్, 2 ప్రభుత్వ ఇంజనీరింగ్... మొత్తం 26 కళాశాలలకు 16,660 సీట్లు వున్నాయి. ఈఏపీసెట్‌లో ఇంజనీరింగ్‌కు కాకినాడ జిల్లాలో 6,343 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2,868 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 6,011 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో సుమారు 70శాతం సీట్లు భర్తీ అయినట్టు సమాచారం. మిగిలిన సీట్లను తుది దశ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నారు.

● అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలి. 99123 42010 నెంబరుకు ఫోను చేయవచ్చని సహాయ కేంద్రం సమన్వయకర్త జనార్దనరావు సూచించారు.

ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ : ఈ నెల 27 నుంచి 30 వరకు
ధ్రువపత్రాల పరిశీలన: 28 నుంచి 30 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు: 28 నుంచి 31 వరకు
వెబ్ ఆప్షన్ల మార్పు: ఆగస్టు 1
సీట్ల కేటాయింపు: ఆగస్టు 4
కళాశాలల్లో రిపోర్టింగ్: ఆగస్టు 4 నుంచి 8 వరకు

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి:

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్ టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ, ఈడబ్ల్యుఎస్, నివాసం, కులం, ఆదాయం, స్థానికత ధ్రువపత్రాలు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు

అందరికీ శుభాలను, మహిళలకు సౌభాగ్యాన్ని ఇచ్చే శ్రావణ మాసం ఆరంభమైంది. తొలి రోజే శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. కొన్నిచోట్ల సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

శ్రావణం... శుభారంభం



కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో పుష్పాలంకరణలో లక్ష్మీదేవి



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విశేష అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు





కాకినాడ జిల్లా కరప, కాకినాడల్లో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాబిందు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం అర్హులైన ఐటీఐ పాస్ అయిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సుధా బిందు ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, విశాఖపట్నం జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, అనకాపల్లి జిల్లాలో డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, విజయనగరం జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్స్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడుల్లో అప్రెంటిస్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 26 నుంచి ఆగస్టు 9వ తేదీ లోపు తమపేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వారు ఆగస్టు 11న, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వారు 12న, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వారు 13న, శ్రీకాకుళం జిల్లావారు 14న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని తెలిపారు. ఏమైనా సందేహాలుంటే ఫోన్ నెం. 08922-294906కు ఫోన్ చేయవచ్చని, ఆయా జిల్లాలప్రభుత్వ ఐటీఐల్లోని అప్రెంటీస్ అడ్వయిజరీ సిబ్బందిని కూడా సంప్రదించవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం తమ అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో, దరఖాస్తుదారులకు తెలియజేసిన నిర్ణీత తేదీల్లో విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ వద్ద హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

జీఐ-ట్యాగ్‌తో ఉప్పాడ చీరలకు విస్తృత ప్రచారం

ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నపై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ వెల్లడి

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీఐ-టాగ్‌తో ఉప్పాడ జాంధానీ చీరలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వెల్లడించారు. పార్లమెంట్‌లో శుక్రవారం టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జీఐ-ట్యాగ్ చేసిన ఉప్పాడ జాంధానీ చీరలను ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతి వివరాలు తెలపాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రమోషన్ కోసం కేటాయించిన, ఉపయోగించిన నిధులు, జీఐ హెల్ప్‌డెస్క్ నుంచి ప్రయోజనం పొందిన నేత కార్మికులు ఉత్పత్తిదారుల వివరాలు తెలపాలని ఎంపీ అడిగారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానమిస్తూ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, నేత ముద్ర పథకం కింద రాయితీ రుణాలు, ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం, ముడి పదార్థాల సరఫరా పథకం కింద అర్హత గల చేనేత ఏజెన్సీలు, అప్‌గ్రేడ్ చేసిన మగ్గాలకు కావల్సిన ఉపకరణాలు సమకూరుస్తున్నామని చెప్పారు. సోలార్ లైటింగ్ యూనిట్లు, వర్క్ షెడ్ నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి, డిజైన్, అభివృద్ధి, సాంకేతిక, సాధారణ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో 691 మంది లబ్ధిదారులను కవర్ చేసే ఉప్పాడ క్లస్టర్ అమలుకు రూ.52.78 లక్షలు ఆర్థిక సాయం అందించామన్నారు, ఆర్ఎంఎస్ఎస్ కింద 2020-21లో రూ.60.32 కోట్లు, 2021-22లో 89.53 కోట్లు, 2022-23లో రూ.139.70 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఎన్ హెచ్‌డీపీ కింద 2023-24లో రూ.186.36 కోట్లు, 2024-25లో రూ.195.50 కోట్లు, 2025-26లో రూ.112.28 కోట్లు ఖర్చు చేసినట్టు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

నేడు 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన



కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం 6గంటలకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారితో 'బుద్ధునితో నా ప్రయాణం-డాక్టర్ అంబేద్కర్ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు నాటక ఆహ్వాన కమిటీ కన్వీనర్ పి.రామారావు కోరారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎస్పీ బిందుమాధవ్ హాజరవుతారన్నారు. సమావేశంలో ఎన్.పెద్దిరాజు, కె.రామారావు, జి.కింగ్, బి.కుమార్, కె.మౌర్య పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.5.36 లక్షలు



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,36,450 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

26, 28, 30 తేదీల్లో 20 రైళ్లు రద్దు

- తాడి-దువ్వాడ మధ్య నాన్‌ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనులు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



ఎల్‌హెచ్‌బీ బోగీలతో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, జూలై 25(ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే సెక్షన్ పరిధిలో తాడి-దువ్వాడల మధ్య నాన్‌ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈ నెల 26, 28, 30 తేదీలలో 20 రైళ్లను రద్దు చేస్తూ రైల్వే ఉన్నతాధికారులు విజయవాడ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారికి శుక్రవారం రాత్రి అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

● సామర్లకోట జంక్షన్ రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే 12717 నెంబరు గల విశాఖ-విజయవాడ మధ్య రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 67285 నెంబరు గల రాజమహేంద్రవరం-విశాఖల మధ్య మెము ప్యాసింజరు ఈ నెల 26, 28, 30 తేదీలలో రద్దు కానున్నాయి.

● 12718 నెంబరు గల విజయవాడ-విశాఖ మధ్య రత్నాచల్ ఎక్స్ ప్రెస్ ఈనెల 26, 28, 30 తేదీల్లో రద్దు కానుంది.

● 22875, 22876 నెంబర్లు గల గుంటూరు-విశాఖ-గుంటూరు మధ్య ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, 30 తేదీలలో రద్దు కానున్నాయి.

'రత్నాచల్'కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

విజయవాడ-విశాఖ మధ్య తిరిగే 12718, 12717 నెంబర్ల రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆగస్టు 8 నుంచి అధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్టు విజయవాడ రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి అందిన సమాచారం ప్రకారం.. మార్పు చేసిన ఈ ఎల్‌హెచ్‌బీ బోగీలలో జనరల్ కేటగిరికి చెంది 8 బోగీలు, చైర్‌కార్ 8 బోగీలు, ఏసీ చైర్‌కార్ 3 బోగీలు, ప్యాంట్రీ కార్ బోగీ ఒకటి, ఈవోజీ ఒకటి, ఎల్ఎస్ఎల్ఆర్‌డీ ఒకటి చొప్పున 22 బోగీలతో విజయవాడ- విశాఖ మధ్య రాకపోకలు సాగించనుంది.

రేపు ఎయిడెడ్ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సీబీటీ

పాఠశాల విద్య జోన్-2 కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నాగమణి

సర్పవరం జంక్షన్(కాకినాడ)/రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జోన్-2 పరిధిలోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్తేర్ ఎగ్గిన్ రెసిడెన్సియల్ ఎయిడెడ్ ప్రాథమిక స్కూలు, కొంతమూరు, ఎస్తేర్ ఏగ్లిన్ రెసిడెన్సియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్ జీటీ, స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టుల భర్తీకి ఈనెల 27న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహించనున్నట్టు పాఠశాల విద్య జోన్-2 కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి ఓ ప్రకటనలో తెలిపారు. సీబీటీ మొదటి సెషన్ ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు జరుగుతుందన్నారు. కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్- ఐడీజడ్, రాజమహేంద్రవరం లూథర్‌గిరి సెంటర్లలో సీబీటీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 98485 74622, 83091 77952 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో మొత్తం 1249 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో శ్రీకోట్ల వెంకటరామయ్య బాలికోన్నత పాఠశాల ఖాళీగా ఉన్న ఎయిడెడ్ టీచింగ్ పోస్టులకు ఈనెల 27న సీబీటీ నిర్వహించనున్నట్టు చెప్పారు. హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ కోసం 99892 71919 ఫోన్ చేసి సమాచారం పొందాలని కోరారు. ఈ పోస్టుల కోసం ఆన్‌లైన్.ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్‌లో దరఖాస్తు చేసుకున్న వారు cse.ap.gov.in / aidedhallticket ద్వారా హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు.పరీక్షా కేంద్రాలకు 90నిమిషాల ముందు గుర్తింపు పొందిన ధ్రువపత్రంతో హాజరు కావాలని ఆర్‌జేడీ కోరారు.

సముద్ర తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేస్తాం



ఉప్పాడ తీరాన్ని పరిశీలిస్తున్న దేవులనాయక్

కొత్తపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ సముద్ర కోత తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేస్తామని పౌరసరఫరాల శాఖ మేనేజరు, కొత్తపల్లి మండల ప్రత్యేకాధికారి ఎం.దేవులనాయక్ చెప్పారు. రెండు రోజుల క్రితం సముద్రం ఉప్పొంగడంతో మాయాపట్నంలో నిరాశ్రయులైన మత్స్యకారుల కుటుంబాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్లడం తప్ప సముద్ర కోతను పూర్తిగా నివారించలేకపోతున్నారని పలువురు మత్స్యకారులు ప్రత్యేకాధికారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు జరిగిన నష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని నాయక్ తెలిపారు. ఆయన వెంట కొత్తపల్లి తహశీల్దారు జి.చిన్నారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వున్నారు.

29, 3 తేదీల్లో ఆర్టీసీ తీర్థయాత్ర స్పెషల్స్



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా జిల్లా ఆర్టీసీ ప్రత్యేకంగా శ్రావణమాస స్పెషల్ ఒకరోజు తీర్థయాత్ర ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతున్నట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. భక్తుల కోరిక మేరకు ఈనెల 29, ఆగస్టు 3వ తేదీల్లో ఈ స్పెషల్ బస్సులు ప్రారంభమవుతాయన్నారు. స్పెషల్ బస్సులు ఉదయం 5గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి బయలుదేరి తిరిగి రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటాయని తెలిపారు. నిడదవోలు కోట సత్తెమ్మ అమ్మవారు, కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారు, భీమవరం మావుళ్లమ్మ తల్లి, యనమదులూరు పార్వతి సమేత శక్తీశ్వరస్వామి, కాళ్లకూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆచంట బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, నత్తా రామేశ్వరం రామేశ్వరస్వామి (త్రిలింగ క్షేత్రం), పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం దర్శించుకోనున్నట్టు పేర్కొన్నారు. టిక్కెట్టు ధర ఒక్కరికి రూ.500గా నిర్ణయించామని, టిక్కెట్లు కావాల్సిన వారు సెల్ నెంబర్లు 95023 00189, 73829 12141లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కె.మాధవ్ కోరారు.

నూతన ఎంపీడీవోలకు ప్రత్యేక శిక్షణ తరగతులు

● 28 నుంచి ప్రారంభం ● విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ ప్రసాదరావు



సామర్లకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో నూతనంగా పదోన్నతులు లభించిన 46 మంది ఎంపీడీవోలకు నెల రోజుల పాటు జరిగే ప్రాథమిక శిక్షణ తరగతులు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నట్టు విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కెఎస్వీ ప్రసాదరావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన నూతనంగా పదోన్నతులు పొందిన 89 మంది ఎంపీడీవోలకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు రెసిడెన్షియల్ పద్ధతిన నెల రోజుల పాటు జరుగనున్నట్టు తెలిపారు. మొదటి బ్యాచ్ తరగతులకు 46 మంది ఈ నెల 28నుంచి హాజరుకానున్నట్టు తెలిపారు. రెండో బ్యాచ్‌లో 43 మంది నెల రోజుల పాటు శిక్షణ పొందుతారన్నారు. పంచాయతీ విస్తరణాధికారులు, పరిపాలనాధికారులుగా పనిచేసిన వీరందరికీ ఇటీవల ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించిందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో వివిధ అంశాల్లో నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర శిక్షణ తరగతులు నిర్వహించేలా రూపొందించామన్నారు. శిక్షణలో పాల్గొనే ఎంపీడీవోలకు వసతి, బస తదితర సదుపాయాలు శిక్షణాకేంద్ర ఆవరణలోనే ఏర్పాట్లు చేసామని ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు.

పరామర్శకు పయనం.. అంతలోనే ప్రమాదం!

- ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్‌బస్సు
- అక్కడికక్కడే ముగ్గురు మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో తల్లీ కూతురు


సంఘటనా స్థలంలో మృతదేహాలు, ఆటో


మృతిచెందిన తల్లి దుర్గ, కుమార్తె భవాని (ఫైల్)



ఆటోడ్రైవర్ కుమార్ మృతదేహం, ఫైల్

తాళ్లరేవు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురుఅక్కడికక్కడే మృతిచెందారు. కోరింగ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ఏటిమొగ నుంచి పోతాబత్తుల దుర్గ(50), కుమార్తె లంకె భవాని (28), వారి బంధువు ఓలేటి లక్ష్మి తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ పరిధి చినవలసల గ్రామంలో ఉన్న దుర్గ మరో కుమార్తె సంగాడి సత్యవతి భర్త గంగరాజు కంటి ఆపరేషన్ చేయించుకోవడంతో పరామర్శించేందుకు శుక్రవారం కాకినాడ నుంచి ఆటోలో బయలుదేరారు. ఆటో తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ రామన్నపాలెం వచ్చేసరికి యానాం నుంచి కాకినాడకు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎదురుగా ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న తల్లి, కూతురు దుర్గ, భవానితో పాటు యానాం కురసాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కురాకుల కుమార్(22)అక్కడికక్కడే మృతిచెందారు. లక్ష్మికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మృతదేహాలను అంబులెన్స్‌లో కోరింగ పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరింగ ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కోరింగ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రావెల్ బస్సును కోరింగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సత్యదేవుడి ఆవిర్భావ వేడుకలు


ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

ఘనంగా ప్రారంభం

నేడు ప్రత్యేక పూజలు


స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి 135వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు అనివేటి మండపంలో స్వామి,అమ్మవార్లను వెండి సింహాసనంపై ఆశీనులు గావించి పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం రుత్విక్‌లకు దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు. రుత్విక్‌వరుణలు జపములు, పారాయణలు, సూర్యనమస్కారములు, కలశస్థాపన గావించారు. సాయంత్రం 3.30కి అగ్నిప్రతిష్ఠాపన పవమాన హోమములు నిర్వహించారు. స్వామివారు శ్రావణ శుద్ధ విదియరోజున రత్నగిరిపై ఆవిర్భవించారు. దీనిలో భాగంగా శనివారం శ్రావణశుద్ధ విదియ సందర్భంగా వేకువజామున 2గంటలకు స్వామి,అమ్మవార్లకు సుప్రభాతసేవ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకములు, పంచామృతాభిషేకములు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9గంటలకు ఆయుష్యహోమం ప్రారంభించి 11గంటలకు పూర్ణాహుతి గావిస్తారు. అనంతరం ఉదయం స్వామి, అమ్మవార్లకు వెండిరథంపై ప్రాకారసేవ, రాత్రికి గరుడవాహనంపై గ్రామసేవ జరుగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో చండీహోమం జరిగింది. అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తశతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బతికుండగానే బలి...!

- ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో తప్పుడు సమాచారం
- చనిపోయినట్టు ఉండడంతో ప్రభుత్వ పథకాలకు దూరం
- లబోదిబోమంటున్న ఆదివాసీలు


ఆన్‌లైన్ డేటాలో మృతిచెందినట్టు చూపుతున్న బాధితులు

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వారంతా బతికే ఉన్నారు. ఐతే ఆన్‌లైన్ డేటాలో వారిని చంపేశారు. డేటా ఎంట్రీ తప్పు వల్ల వారంతా ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం చిడుమూరు గ్రామ పంచాయితీ చిడుమూరు, జువ్విగూడెం, బుర్కనకోట గ్రామాల్లో పలు కుటుంబాలు డేటా ఎంట్రీదారుల నిర్లక్ష్యానికి బలయ్యారు. చిడుమూరుకు చెందిన మోసం రుతు వయస్సు 17ఏళ్లు. డేటా ఎంట్రీలో మృతి చెందినట్టు చూపడంతో పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. జువ్విగూడెనికి చెందిన ముర్రం మీన, సోడె రంగమ్మ, ముర్రం తిరుపతమ్మ, బుర్కనకోటకు చెందిన కుంజా ముత్తమ్మ, చిడుమూరుకు చెందిన సవలం నాగమ్మ వితంతువులు. భర్తలు కాలం చేయడంతో చేతి కష్టంతో బతుకుసాగిస్తున్నారు. ఐతే వారందరినీ డేటా ఎంట్రీలో చంపేశారు. దీంతో వీరంతా వితంతు పింఛనకు దూరమయ్యారు. అదే దశలో జువ్విగూడెనికి చెందిన కుంజా ఏసుబాబు, ముర్రం రాజు పేర్లు కూడా డేటా ఎంట్రీలో లేకపోవడంతో రేషను పొందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో బాధితులంతా ఎన్నో రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఎవరూ పరిష్కారం చూపడంలేదు. దీంతో నష్ట పోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. మరి తమ గోడును పట్టించుకునేదెవరని బాధితులు వాపోతున్నారు.

'అన్నవరం'లో అవకతవకలు.. ఈవో చర్యలు

రూ.30 లక్షలు నకిలీ పీఎఫ్ చలానాలకు సంబంధించి ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

రూ.84 లక్షల జీఎస్టీ వసూలులో నిర్లక్ష్యం వహించిన నలుగురికి నోటీసులు

అన్నవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో జరుగుతున్న అవకతవకలు దీనివెనక ఉన్న పాత్రధారులపై చర్యలకు ఈవో వీర్ల సుబ్బారావు ఉపక్రమించారు. ఇటీవల దేవస్థానం శానిటరీ కాంట్రాక్టర్ కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థ కార్మికులకు పీఎఫ్ చెల్లించకుండా రూ.30 లక్షలు నకిలీ చలానాలను అందించి దేవస్థానం నుంచి బిల్లులు పొందడం కార్మికుల ఫిర్యాదుతో విషయం బయటపడింది. దీంతో సంబంధిత కాంట్రాక్ట్ సంస్థపై దేవస్థానం ఫిర్యాదుచేయగా దీనిలో భాగస్వామ్యం అయిన దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ మురాలశెట్టి రామకృష్ణను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి నెలలో సూపరెంటెండెంట్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం సింహాచలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న బలువు సత్యశ్రీనివాస్‌కు చార్జిమెమో ఇచ్చారు. దేవస్థానంలో 2023 నుంచి టోల్‌గేట్ లీజుదారు నుంచి జీఎస్టీ, లీజు బకాయి సుమారు రూ.84 లక్షలు వసూలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన అప్పటి సూపరెంటెండెంట్ కిషోర్, ప్రస్తుతం సెలవులో ఉన్న సీనియర్ అసిస్టెంట్ వోలేటి జగన్నాథానికి చార్జిమెమో, ప్రస్తుత లీజుల విభాగం సూపరెంటెండెంట్ పీవీ.రమణ, జూనియర్ అసిస్టెంట్ వనపర్తి రమేష్‌ను దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆలయ ఈవో ఒక్కసారిగా ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారగా దేవస్థానం ఉద్యోగుల్లో గుబులు రేకెత్తిస్తోంది.

పురుగుల మందుల దుకాణంలో తనిఖీలు

గొల్లప్రోలులో రూ.1.14 లక్షల విలువైన స్టాక్ సీజ్

గొల్లప్రోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని పురుగుల మందు దుకాణం హనుమాన్ ట్రేడర్స్‌లో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. షాపుపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో దుకాణం నిర్వాహకులు అందుబాటులో లేకపోవడంతో 2రోజుల క్రితం అధికారులు సీలు వేశారు. శుక్రవారం సీలు తొలగించి తనిఖీలు జరపగా స్టాకు నిల్వలు, రిజస్టర్లకు తేడాలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో రూ.1,14,625 విలువైన పురుగు మందుల స్టాకును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు పంపుతున్నట్టు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, గొల్లప్రోలు, పిఠాపురం వ్యవసాయ అధికారులు కేవీవీ సత్యనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

కొమురం భీం విగ్రహం ధ్వంసం కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

కూనవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కొమురం భీం విగ్రహ ధ్వంసం కేసులో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ లతాశ్రీ కథనం ప్రకారం... ఈనెల 9న అర్ధరాత్రి కొమురం భీం విగ్రహం వద్ద ఫొటోలు తీసుకునేందుకు ముగ్గురు వెళ్లి తుంటరి చర్యలకు పాల్పడ్డారు. ఓ వ్యక్తి సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించగా విగ్రహం చేయి ధ్వంసం అయింది. దీంతో వారు అక్కడి నుంచి భయంతో వెళ్లిపోయారు. ఈనెల 11న ఆదివాసీ నాయకులు కుంజా అనిల్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి శుక్రవారం ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్టు తెలిపారు. ముగ్గురిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

యూసీఈకేలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

35 మంది విద్యార్థులు ఎంపిక


వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అధికారులతో ఎంపికైన విద్యార్థులు

జేఎన్టీయూకే, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యూసీఈకేలో 2 రోజులు నిర్వహించిన ఎండేవా కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ నుంచి 130 మంది పాల్గొనగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు వీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను డాక్టర్ అరవ కరుణ, ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు నిర్వహించగా ఎంపికైన విద్యార్థులను వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్ అభినందించారు.

ఉధృతంగా శబరి

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు వద్ద శబరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకల్లో చేరిన వర్షపు నీరు చివరకు శబరిలో కలిసి ఉధృతంగా మారింది. భద్రాచలంలో శుక్రవారం సాయంత్రానికి గోదావరి ప్రవాహం 25 అడుగుల మేర ప్రవహిస్తోంది. సోమవారం సాయంత్రానికి 30 అడుగుల ప్రవాహానికి చేరుకునే అవకాశం ఉన్నట్టు సీడబ్ల్యుఎస్ అంచనా వేస్తోంది.


చింతూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి

220 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్ట్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తూ భారీగా గంజాయిని స్వాధీనం చేస్తున్నారు. ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గామన్ వంతెన రోడ్‌లోని నయారా పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు రిజిస్ట్రేషను నంబరుతో ఉన్న ఇన్నోవా వాహనంలోని వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారులో 10 బస్తాల గంజాయిని గుర్తించారు. వాటిలోని 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన నాగరాజు, సుబ్రహ్మణ్యం, జైసల్వాను అదుపులోకి తీసుకున్నామని హనుశ్రీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్త్‌స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యక్తిని గంజాయితో అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ర్యాలికి చెందిన పువ్వల మణికంఠ వద్ద గంజాయి ఉందన్న సమాచారం మేరకు ఎస్ఐ రాము సిబ్బందితో శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రమూర్తి, వీఆర్వో, వీఆర్‌ఏ సమక్షంలో రాము వద్ద నుంచి 470 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో మరో ఆరుగురిని అరెస్టు చేయాల్సి ఉందని, వారు పరారీలో ఉన్నారన్నారు.


ర్యాలిలో గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌లకు

రూ.19లక్షలు విరాళం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టర్ షాన్‌మోహన్‌కు రూ.15 లక్షల చెక్కు ఇస్తున్న అరబిందో ప్రతినిధులు


కలెక్టర్‌కు రూ.4లక్షల చెక్కును ఇస్తున్న ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో కాకినాడలో నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌లకు శుక్రవారం రూ.19 లక్షలు విరాళాలు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెండు సంస్థల నుంచి ఆయన చెక్కులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిలో అరబిందో ఫార్మ ఫౌండేషన్ నుంచి సీఎస్ఆర్ నిధుల కింద రూ.15లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. అలాగే కాకినాడ ఆదిత్య విద్యా సంస్థలు రూ.4లక్షలు విరాళంగా ఇచ్చాయన్నారు. కాకినాడలో నిర్వహిస్తున్న ఈ రెండు కార్య క్రమాలకు విరాళాలు ఇచ్చిన అరబిందో ఫార్మ ఫౌండేషన్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ జీఎం ఎ.శ్రీనివాస్, సీఎస్ఆర్ జీఎం సుధాకర్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు సుగుణరెడ్డి, శృతిరెడ్డిలు పాల్గొన్నారు.

మావోయిస్టు దళ సభ్యురాలు లొంగుబాటు


లొంగిపోయిన దళ సభ్యురాలికి ప్రోత్సాహకాన్ని అందిస్తున్న ఓఎస్డీ, అధికారులు

ఎటపాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలానికి చెందిన సీపీఐ మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు కొవ్వాసి దేవే అలియాస్ సుమిత్ర పోలీసులు ఎదుట లొంగిపోయినట్టు ఓఎస్డీ జగదీష్ అడహిళ్లీ తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా కొంటా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగరాజపాడుకిచెందిన దేవే 22 ఏళ్ల వయసులో ఏరియా కమిటీ సభ్యుడు, కొంటా ఎల్‌వోఎస్ కమాండర్ మడకం కోసిని ఆదర్శంగా తీసుకుని దళంలో చేరినట్టు చెప్పారు. 2024 జనవరిలో ఈమెతో పాటు మడివి హిడ్మా బెటాలియన్ కమాండర్‌తో పాటు 900 మంది దళ సభ్యులు ఛత్తీస్‌గడ్‌లోని ధర్మవరం పోలీస్ క్యాంపుపై దాడిలో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. లొంగిపోయిన దేవే పై రూ.లక్ష రివార్డు ఉందని ఓఎస్డీ తెలిపారు. ఈయనతో పాటు సీఐ కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు ఉన్నారు.

చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు శిక్ష

రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సుమ స్కూల్, రాజానగరంలోని సుమ రిఫైనరీలో డైరెక్టర్‌గా ఉన్న ఉప్పులూరి వీర వెంకట కాశీ నాగకుమారి వేసిన వెంచర్‌లో నగరానికి చెందిన ముళ్లపూడి లలితాదేవి స్థలాల కొనుగోలుకు రూ.15లక్షలు అడ్వాన్సుగా ఇచ్చారు. అయితే ఆమె ఓ ఒప్పందం ఉల్లంఘించడంతో లలితాదేవి నిలదీయగా ఆమెకు రూ.19లక్షలు చెక్కు ఇచ్చారు. చెక్కు బౌన్స్ కావడంతో లలితాదేవి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో రూ.33,09,325 నగదును 9% వడ్డీతో లలితాదేవికి చెల్లించడంతోపాటు నాగ కుమారికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.




తీరం.. కోత భారం!

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి కారణంగా ఉప్పాడ, సూరాడపేట, మాయపట్నం గ్రామాల్లో మత్స్యకారుల ఇళ్లు కోతకు గురికావడంతో వారి మనసులు ఎంతో భారంగా మారాయి.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

అమలాపురం

బాణసంచా షాపులకు దరఖాస్తులు

యానాం, జూలై25(ఆంధ్రజ్యోతి): యానాంలో దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని పరిపాలనాధికారి మునిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 21లోగా దరఖాస్తులను పంపించాలన్నారు. పేలుడు చట్టం నిబంధనల మేరకు నివేదికను సమర్పించాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఇసుకపూడిలో రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, జూలై25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందనిఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఇసుకపూడిలో నాబార్డు నిధులు రూ.1.25కోట్లతో 1.7కిలోమీటర్ల ప్రధాన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఇసుకపూడి ప్రధాన రహదారికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మోక్షం లభించిందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు గజమాలతో సత్కరించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపీడీవో ఏవీఎల్ నరసింహం, ప్రాజెక్టు జేఈ సంపన్, డిప్యూటీ ఎంపీడీవో సంపన్, నాయకులు దాసరి సత్యనారాయణ, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, యనమదల సాయిబాబా, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

'ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం మానుకోవాలి'

అమలాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో అమలాపురం ఆర్టీసీ డిపో జనరల్ బాడీ సమావేశం జిల్లాశాఖ అధ్యక్షుడు పి.సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ ప్రసాద్, జోనల్ కార్యదర్శి వైఎస్‌రావు హాజరయ్యారు. ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే విధానాలు మానుకోవాలన్నారు. జోనల్ కార్యదర్శి రావు మాట్లాడుతూ ఉద్యోగులపై పనిభారం పెంచే విధానానికి స్వస్తి పలకాలన్నారు. జోనల్‌ఆర్గనైజింగ్‌కార్యదర్శి కేవీఎస్ నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్వీఆర్సీహెచ్ రావు, జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, డిపోకార్యదర్శి ఎస్ఎస్వీ గణేష్‌పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. రాణేలంక పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ పాలనలో పీఏసీఎస్‌ల ద్వారా అమలుచేసిన రాయితీలను వైసీపీ ప్రభుత్వం తొలగించి రైతులకు అన్యాయం చేసిందన్నారు. గతంలో అమలుచేసిన పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తుందన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి త్రిసభ్య కమిటీలు కృషి చేయాలన్నారు. మరోఅతిథి డీసీసీబీచైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) మాట్లాడుతూ సహకార



రాణేలంక పీఏసీఎస్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు


సంఘాలు రైతులకు పూర్తి పారదర్శకతతో సేవలందిస్తూ వారికి అండగా నిలవాలన్నారు. త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా గోదశి పుండరీస్, సభ్యులుగా పళ్ల రామారావు, బొక్కా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. వేదికపై స్థలదాత డాక్టర్ గోదశి గంగరాజును కూడా సత్కరించారు. నూతనపాలకవర్గాన్ని పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో అభినందించారు. గుద్దటి జమి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓగూరి భాగ్యశ్రీ, చెల్లి అశోక్, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, గోదాశి నాగేశ్వరరావు, గొలకోటి దొరబాబు, దాట్ల పృథ్వీరాజ్, దూడల స్వామి, కర్రా దుర్గాప్రసాద్, త్సవటపల్లి శ్రీను, త్సవటపల్లి నాగు, మద్దింశెట్టి పురుషోత్తం, అత్తిలి బాబూరావు, ముత్యాల జయలక్ష్మి, బద్రిరమ, లంకలపల్లి రాణి, గిడ్డి రత్నశ్రీ, గణేశుల బ్రహ్మానందం, విత్తనాల అర్జున్, పొద్దోకు నారాయణరావు, తాడి జానకీరామ్, మాదాల శ్రీధర్, అడబాల సతీష్‌కుమార్, గుద్దటి విజయ్, నూకలదుర్గ, గాలిదేవర బుల్లి, డీసీసీబీ మేనేజర్ యెరుబండి సత్యనారాయణ, పీతల శ్రీనివాసరావు, సీఈవో మాదాల కుమార్, రంబాల రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అంతర్వేది రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహింపచేస్తున్న అర్చకులు

అంతర్వేది, జూలై 25(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు ప్రత్యేకగా దర్శనమిచ్చారు. సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులకు అమ్మవారి రూపు, పూజా సామగ్రి ఉచితంగా పంపిణీ చేసినట్టు ఆలయ ఏసీ వరప్రసాద్ తెలిపారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు.



మామిడికుదురు: పసుపు కొమ్ములతో దొడ్డిగంగాలమ్మకు ప్రత్యేక అలంకరణ

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): నగరం గ్రామదేవత దొడ్డి గంగాలమ్మవారిని శ్రావణమాసం సందర్భంగా భక్తులు పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు. శ్రావణమాస శుక్రవారం కావడంతో రంగురంగుల పసుపుకొమ్ములను దండగా కూర్చి అమ్మవారి మెడలో మాలగా వేశారు. అమ్మవారికి స్థానిక మహిళలు పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు సమర్పించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి మొల్లేటివారి పాలెంలో గల రామాలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో మండలంలోని అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో మహిళలు వరలక్ష్మీదేవిని ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. అప్పనపల్లి రామాలయంలో అర్చకుడు బొక్కా ఫణీంద్ర అర్చకత్వంలో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి రోజు సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ని మహిళలు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్ల వద్ద మహిళలు అమ్మవార్ని ప్రత్యేకంగా అలంకరించుకుని పూజలు చేశారు.

ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బాపూజీ

ముమ్మిడివరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల సూర్యనారాయణ నాయకత్వంలో రాష్ట్రంలోని 8లక్షల ఉద్యోగులను ఐక్యంచేసి ముందుకు సాగుదామన్నారు. జిల్లాలో అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సచివాలయ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు మాట్లాడుతూ ఈనెల 25, 26 తేదీల్లో విజయవాడలో జరగనున్న ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాట కార్యక్రమంపై కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.వీరబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, సర్వీసు రూల్స్ సమస్యలు ఏ డిపార్టుమెంట్‌లో ఉన్నా జిల్లా నాయకులుగా వచ్చి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. జిల్లా కోశాధికారి ఎస్.రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక: తాలూకా అధ్యక్షుడిగా జీఎస్‌వీడీ ప్రసాద్, కార్యదర్శిగా రెడ్డి సుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.నూకరత్నం, ఉపాధ్యక్షులుగా డాక్టర్ పూజ, టీ.సుజాత, డి.సువర్ణరాజు, ఎం.స్టీవెన్‌లు, కోశాధికారిగా డి.మహేష్, సహాయ కార్యదర్శులు ఎం.మహేష్, సీహెచ్ లలితలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా విజయ్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ తాలూకా కమిటీ ఎన్నికల సమావేశంలో అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అడపా

అల్లవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బోడసకుర్రు గ్రామానికి చెందిన అడపా శ్రీనివాసరావును నియమించారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా, బోడసకుర్రు ఉపసర్పంచ్‌గా మూడు పర్యాయాలు, అమలాపురం అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌గా శ్రీనివాసరావు పనిచేశారు. జిల్లా కార్యదర్శిగా రేకాడి వర్మ (ఓడలరేవు), కార్యవర్గ సభ్యుడిగా సుంకర సత్యసాయిబాబా (అల్లవరం)ను నియమించారు.

ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు

పి.గన్నవరం,జూలై25(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బెల్లంపూడికి చెందిన చీకరమిల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా నాయకులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

బీజేపీ నాయకుడు ముక్కామల మృతికి సంతాపం

పి.గన్నవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ సభ్యుడు ముంగండ గ్రామానికి చెందిన ముక్కామల సుబ్రహ్మణ్యశాస్త్రి ఇటీవల మృతి చెందారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, ఇలపర్తి మల్లేశ్వరరావు, మట్టపర్తి వెంకటనారాయణ, పితాని వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం తెలిపారు.

కూటమి సమన్వయ కమిటీని నియమించాలి

అమలాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లిలో టీడీపీ నాయకులు కూటమి పొత్తు ధర్మాన్ని పాటించడం లేదని జనసేన నాయకులు ఆరోపించారు. శుక్రవారం గ్రామానికి చెందిన జనసేన నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి తాతారావు, ఉపసర్పంచ్ ఉర్రింక రెడ్డినాయుడు, ఎంపీటీసీ కోరుమిల్లి రాంబాబు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, జనసేన నాయకుల మాటకు విలువ ఇవ్వడం లేదని ఆరోపించారు. వెంటనే గ్రామంలో కూటమి పార్టీల నాయకులతో సమన్వయ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు.

'దళితులపై దాడిచేసిన వారిపై రౌడీషీట్లు తెరవాలి'



ఎస్పీ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అమలాపురంటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): దళితుడు దోనిపాటి మహేష్‌కుమార్‌పై దాడి కేసులో నిందితులందరిపై రౌడీషీట్లు తెరిచి అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని దళిత ఐక్యవేదిక డిమాండ్ చేసింది. జిల్లాలో మంత్రి వాసంశెట్టి సుభాష్ రౌడీలకు వత్తాసుపలకడం సిగ్గుచేటని ఆరోపించారు. దళితుడికి న్యాయం జరగని పక్షంలో దళితులంతా యాక్షన్ ఫోర్సుగామారి ప్రతి దాడులకు దిగుతామని హెచ్చరించారు. తొలుత అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో 22మండలాల ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం డీబీ లోక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన రాయల్ కళాశాల గుర్తింపును రద్దుచేసి ప్రిన్సిపాల్ గుత్తుల విజయ్‌కుమార్‌పై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును కలిసి దళితులపై దాడులు అరికట్టాలని, నిందితులను శిక్షించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, కోకన్వీనర్ రేవు తిరుపతిరావు, గెడ్డం సురేష్‌బాబు, కొంకి రాజామణి, పెనుమాల చిట్టిబాబు, సాపే బాలరవి, ఉండ్రు ఆశీర్వాదం, అయితాబత్తుల వెంకటకృష్ణారావు, జిత్తుక సత్యనారాయణ, కప్పల శ్రీధర్, నల్లి శ్రీను, పొలమూరి మోహన్‌బాబు, గంటి చిరంజీవి, పండు సత్యనారాయణ, కడిమి గంగాధర్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అమలాపురంటౌన్,జూలై25(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల్లో అండర్-13 రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. ఎంపికైనవారు ఆగస్టు2న మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు హాజరవుతారన్నారు. బాలికలు, బాలుర విభాగంలో ఇద్దరు చొప్పున ఎంపికచేస్తామన్నా రు. పోటీలో పాల్గొనేవారు 26వతేదీ సాయంత్రం 6గంటలలోపు పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు సెల్ 9849175179నుసంప్రదించాలన్నారు.

దళితుల నిరసన

అల్లవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల దోనిపాటి మహేష్‌పై దాడికి పాల్పడ్డ దోషులందరినీ కఠినంగా శిక్షించాలంటూ గోడిలంకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీదుర్గారావు, సాధనాల వెంకట్రావుల ఆధ్వర్యంలో దళితులు ఆందోళన చేశారు. దోషులందరినీ శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటూ నినాదాలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబుపై కేసు పునఃపరిశీలించాలని ఆదేశించడం పట్ల దళిత నేతలు హర్షం వ్యక్తం చేశారు. యాలంగి సత్యనారాయణ, కాశి బాలయోగి, బళ్ల సత్యనారాయణ, కుంచే చంద్రరావు, కఠారి చంద్రరావు, కుంచే శ్రీను, శెట్టిబత్తుల శ్రీను, దళిత యువకులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ సౌజన్యంతో డస్ట్‌బిన్లు

అమలాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ కాకినాడ ఆధ్వర్యంలో అమలాపురం ఆర్టీసీ డిపోకు 12 కొత్త డస్ట్‌బిన్లను శుక్రవారం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తికి అందజేశారు. ఆలిండియా ఉమెన్ కార్పొరేషన్ కార్యదర్శి ఎస్.భానుమతి, ఎం.మీనాక్షి, డాక్టర్ పీఎస్ శర్మ, దేవి, ప్రతిమాకుమారి, ఎన్.వరహాలబాబు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు భరోసా



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎందరికో మేలు జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం విశ్వేశ్వరాయపురంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద 30 మందికి రూ.32లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యపరంగా ఇబ్బంది పడే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. నియోజకవర్గంలో పలు దఫాలుగా 375మందికి రూ.3.38కోట్లు అందించామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం పేదల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. గుండుబోగుల పెదకాపు, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, సూరిశెట్టి శ్రీనివాస్, ఇంటిపల్లి ఆనందరాజు, శివ, బాలాజీ, తాతాజీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి

మలికిపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. శుక్రవారం రామరాజులంకలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేపడుతున్నామన్నారు. ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, బొరుసు ఉమారావు, మంగెన భూదేవి, అడబాల యుగంధర్, బందెల పద్మ, నల్లి బాబూరావు, కట్టా వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో కార్గిల్ విజయ్ దివస్

యానాం, జూలై 25(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం నేతాజీ సుభాష్ చంద్రబోస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ రాంజీ ప్రసంగించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్, ఉపాధ్యాయులు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పద్మం సిల్వర్ జ్యూవెలరీ ప్రారంభం

ప్రారంభించిన సినీతార ఐశ్వర్యరాజేష్, బాలనటుడు బుల్లిరాజు



అమలాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని హైస్కూలు రోడ్డులో గల సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో పద్మం సిల్వర్ జ్యూవెలరీ మరో శాఖను ప్రారంభించింది. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఫేం ఐశ్వర్యరాజేష్, అదే సినిమాలో బుల్లిరాజుగా పేరొందిన బాలనటుడు రేవంత్‌తో కలిసి ఈస్టోర్‌ను ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ, ఒడిసాలోని పలుప్రాంతాల్లో ఇప్పటికే పద్మం సిల్వర్ జ్యూవెలరీ సంస్థ వివిధ శాఖలు ఏర్పాటుచేసింది. అమలాపురంలో సీఎంఆర్‌లో ఈశాఖ ప్రారంభోత్సవం సందర్భంగా నటి ఐశ్వర్యరాజేష్ మాట్లాడుతూ అమలాపురంలోని పద్మం సిల్వర్ జ్యూవెలరీ స్టోర్‌వారు అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించారని, రూ.లక్ష కొనుగోలుపై రూ.50వేల విలువైన సిల్వర్ నగలు ఉచితంగా, రూ.50వేల నగదు కొనుగోలుపై రూ.25వేలు నగలు ఉచితంగా, రూ.25వేల కొనుగోలుపై రూ.12,500 సిల్వర్ నగలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. అమలాపురం రావడం తనకెంతో ఆనందంగా ఉందని బాలనటుడు బుల్లిరాజు అన్నాడు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు సీఎంఆర్‌కు చెందిన సంస్థ ప్రతినిధులు, పద్మం జ్యూవెలరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ప్రజారోగ్యం

అమలాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానాలతో పండించిన ఉత్పత్తులతో ప్రజారోగ్యం ఎంతగానో మెరుగుపడుతుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కెనడీ పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరమన్నారు. వ్యవసాయశాఖ, రాష్ట్ర సాధికార సంస్థ సమన్వయంతో శుక్రవారం డీపీఎం శ్రీనివాస్, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్స్‌కు మూడు రోజుల ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం కెనడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో శాస్త్రీయతను టి.విజయ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివరించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా పలు అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.ప్రవీణ్, ఎన్ఎఫ్ఏ హేమలత, ఎంటీ సూరిబాబు, ఎఈవో ప్రేమ్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

'గురుకులం'లో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

అల్లవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గోడి అంబేడ్కర్ బాలురు, బాలికల గురుకుల కళాశాలలో 5, పదో తరగతి, ఇంటర్‌లో మిగిలిన సీట్ల కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాలల ప్రిన్సిపాల్స్ నక్కా శ్రీనివాస్, బి.శివప్రవీణ వేర్వేరు ప్రకటనల్లో కోరారు. విద్యార్థులు ఆధార్, ధ్రువపత్రాలతో కళాశాలలో దరఖాస్తులుచేసుకోవాలన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ముమ్మిడివరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛమైన మంచినీరు, రోడ్డు రవాణా సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. రాణేలంకలో శుక్రవారం రూ.22.80లక్షలతో నిర్మించనున్న మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే నూతనంగా నిర్మించిన గోశాలను ఆయన ప్రారంభించారు. మంచినీటి ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని సమకూర్చిన ఇసుకపట్ల వెంకటేశ్వరరావును పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, గుద్దటి జమ్మి, దూడల స్వామినాయుడు, పిల్లి నాగరాజు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, దంగేటి శ్రీనివాస్, కొప్పిశెట్టి శేర్, బొక్కా సత్తిబాబు, పిల్లి ఏడుకొండలు, ఇసుకపట్ల ఈశ్వర్‌కుమార్, చింతలపూడి సూర్యనారాయణ, ఆకుల బుజ్జి, నక్కా వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీవారాహి మాత దర్శనానికి బస్సు సర్వీసు

రాజోలు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాజోలు డిపో నుంచి శ్రావణమాసం సందర్భంగా కాకినాడలో శ్రీవారాహి మాత ఆలయాన్ని దర్శించుకునేందుకు ఈనెల 27వ తేదీ ఉదయం 6గంటలకు రాజోలు ఆర్టీసీ డిపో నుంచి బస్సు బయలుదేరుతుందని రాజోలు ఆర్టీసీ డీఎం పి.ధనమ్మ తెలిపారు. ఈసందర్భంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ భక్తుల కోసం రాజోలు డిపో నుంచి లాభాపేక్ష లేకుండా కేవలం సేవా దృక్పథంతో ఒక ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నామన్నారు. టిక్కెట్ ధర కేవలం రూ.400గా ఉందన్నారు. ఈపవిత్ర శ్రావణమాసంలో అమ్మవారి దర్శనం పొందిన భక్తులకు అమ్మవారి ఆశీస్సులు ఉంటాయన్నారు. వివరాలకు సెల్: 98661 77922ను సంప్రదించాలని డీఎం ధనమ్మ తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా శకుంతల

ముమ్మిడివరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్‌బీఆర్‌అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పాటి శకుంతల, వైస్ ప్రిన్సిపాల్‌గా ఎ.సీతాకుమారి నియమితులయ్యారు. శుక్రవారం వారు బాధ్యతలు స్వీకరించగా స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నల్లా సత్యనారాయణ, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపి దుశ్శాలువాలతో సత్కరించారు.దాకే స్వరూపసత్తిబాబు, వడ్డి శ్యామ్‌ప్రసాద్, వీధి చంటిబాబు, ఎంవీ సూర్యం, కొండేటి చంద్రశేఖర్, ఎస్వీ సత్యనారాయణ, జి.శ్రీనివాస్, గొల్లపల్లి గోపి, కె.కిరణ్‌కుమార్, డి.ప్రకాష్ పాల్గొన్నారు.

ఒక బూత్‌లో 1200 ఓట్లు మించకూడదు

పి.గన్నవరం,జూలై25(ఆంధ్రజ్యోతి): ఒక బూత్‌లో 1200ఓట్లు మించి ఉంటే సంబంధిత ఓట్లను సమీప పోలింగ్‌బూత్‌లోకి మారుస్తామని నియోజకవర్గ అసిస్టెంట్ ఓటర్ల నమోదు అధికారి, తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 1200ఓట్లు మించి ఉంటే కొత్త పోలింగ్‌బూత్ ఏర్పాటు, తక్కువఉంటే సమీపబూత్‌కు మార్పుస్తామన్నారు. నియోజకవర్గంలో 22పోలింగ్‌బూత్‌లు ఉన్నాయన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో జరిగే ఓట్ల పరిశీలనలో 2002ముందు నమోదైన ఓటర్లు ఫారం-సీ, ప్రస్తుత పాస్‌పోర్ట్‌ఫొటో, 2002తరువాత నమోదైన ఓటర్లు ఫారం-సీ,డీ,6 అందించాలన్నారు. త్వరలో నూతన ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సంసాని పెద్దిరాజు, చీకరమిల్లి శ్రీనివాసరావు, కాంగ్రేసుల నరసింహం, చిట్టాల వీరవెంకటసత్య నారాయణ, యన్నాబత్తుల ఆనంద్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ స్వామీజీరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేయాలి: ఎమ్మెల్యే



ఆర్టీసీ చైర్మన్ నారాయణరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఆర్టీసీ బస్ డిపోను అత్యాధునికంగా అభివృద్ధి చేయాలని ఆర్టీసీ చైర్మన్ కొణకళ్ల నారాయణరావుకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. విజయవాడ ఆర్టీసీ భవన్‌లో శుక్రవారం ఎమ్మెల్యే ఆనందరావుతో పాటు నాయకుల బృందం చైర్మన్‌ను కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, దంతులూరి వాసురాజు, పొలమూరి ధర్మపాల్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే అమలాపురం డిపోను సందర్శిస్తానని నారాయణరావు హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

పళ్లస్వామి చారిటీస్ చైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మి

ముమ్మిడివరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): పళ్ల స్వామి చారిటీస్ చైర్‌పర్సన్‌గా పళ్ల వెంకటలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గంగాభవానీ, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సమక్షంలో చైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మి, సభ్యులుగా మరో తొమ్మిది మందితో ప్రమాణ స్వీకారం చేయించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శుక్రవారం ప్రమాణ స్వీకారం జరిగింది. పళ్ల రాజబాబు, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, గుద్దటి జమ్మి, తాడి నరసింహారావు పాల్గొన్నారు.

వాహనాల లైసెన్స్‌పై విద్యార్థులకు కౌన్సెలింగ్

అమలాపురం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన విద్యార్థులకు శుక్రవారం అమలాపురంలోని జిల్లా రవాణాధికారి కార్యాలయంలో డీటీవో దేవిశెట్టి శ్రీనివాసరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో పట్టుబడ్డ వాహనాల విడుదల కోసం ఆర్టీఏ కార్యాలయానికి విద్యార్థులు వచ్చారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన విద్యార్థులకు డీటీవో సమక్షంలో లెర్నింగ్ లైసెన్సు స్లాట్‌లను బుక్‌చేసి టెస్టుకు రావాల్సిందిగా సూచించారు. విద్యార్థులతో హెల్మెట్లు ధరింపచేసి వాటి ప్రాధాన్యతను వివరించి వాహన విడుదల పత్రాలను డీటీవో అందజేశారు.

ముగిసిన కార్యశాల

కాట్రేనికోన, జూలై 25(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసాఅటానమస్ ఇంజనీరింగు కళాశాలలో కృత్రిమ మేధతో స్థిరీకరణ అంశంపై మూడు రోజుల కార్యశాల శుక్రవారం ముగిసింది. ప్రతి విద్యార్థి కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకోవాలని కరస్పాండెంట్ డీవీఎస్ వర్మ అన్నారు. మైక్రోసాఫ్ట్ అనుబంధసంస్థ ఐఎంబీ సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య ఉపన్యాసకునిగా తూర్పుగోదావరి జిల్లా ఐఎంబీ అధ్యక్షుడు కె.సాగర్, కార్యనిర్వాహక సభ్యురాలు స్నేహ 1200మంది విద్యార్థులకు కృత్రిమ మేధ, సరళీకరణ, ఆధునిక సాంకేతిక పద్ధతులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ప్రిన్సిపాల్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

రూ.1.83లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం

అమలాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఒక కేసులో వినియోగదారుల కమిషన్ జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈకేసుకు సంబంధించిన వివరాలను బాధితుడు, వినియోగదారుల పట్టణ అధ్యక్షుడు జీవీఎల్ఎన్ శర్మ శుక్రవారం విలేకరులకు వివరించారు. అమలాపురంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియావారు ఓ వ్యక్తి బాకీపడిన సొమ్ముల వసూళ్ల కోసం అతడికి సంబంధించిన ఆస్తిని గత ఏడాది జూన్ 26న నిర్వహించిన ఈ-వేలంలో శర్మ పాల్గొని రూ.5,25,700 చెల్లించి ఆ పాటలో ఆస్తిని దక్కించుకున్నారు. మొత్తం సొమ్ములు బ్యాంకుకు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయాలని బ్యాంకు వారిని కోరారు. అయితే బాకీ పడి, వేలం వేయబడిన ఆస్తికి చెందిన యజమాని బ్యాంకు వారు వేలానికి సంబంధించిన విధివిధానాలు సరిగా పాటించలేదని, కాబట్టి ఆ వేలాన్ని రద్దు చేయాలని కోరుతూ వేలం పాటలో పాల్గొన్న జీవీఎల్ఎన్ శర్మపై విశాఖపట్నంలోని డెబిట్స్ రికవరీ ట్రిబ్యునల్(డీబీటీ)లో కోర్టులో కేసు వేశారు. దీంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు శర్మ వేలం సమయంలో చెల్లించిన సొమ్ములను తిరిగి ఆయన బ్యాంకు ఖాతాకు జమ చేశారు. దీనిపై స్పందించిన శర్మ బ్యాంకు విధివిధానాలు పాటించకుండా తనకు నష్టం చేయడం, శారీరక, మానసిక వేదనకు గురిచేశారని, అందుకు రూ.5లక్షలు పరిహారం, కోర్టు ఖర్చులు, చెల్లించిన సొమ్ముకు వడ్డీ ఇవ్వాలని రాజమహేంద్రవరం వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. వడ్డీ కింద రూ.63,924, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.లక్ష, కోర్టు ఖర్చుల కోసం రూ20వేలు వెరసి రూ.1,83,924 చెల్లించాలని కమిషన్ ఆదేశాలు ఇచ్చిందని వినియోగదారుల జీవీఎల్ఎన్ శర్మ విలేకరులకు తెలిపారు.


భువనేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు

అమలాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పవిత్ర శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భువనేశ్వరి అమ్మవారికి అష్టద్రవ్య అభిషేకాలుజరిపించారు. 108స్వర్ణ పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితుడు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో కొండా హనుమంతరావు దంపతులు కర్తలుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. చింతా అత్తిలింగం కుటుంబ సభ్యులు సమకూర్చిన పసుపు, కుంకుమ, చీర వంటి వాటిని డ్రాతీసి భక్తులకు అందజేశారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులుపాల్గొన్నారు.

కోడిపందాల శిబిరంపై దాడి

ముమ్మిడివరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అయినాపురంలో కోడిపందాల శిబిరంపై పోలీసులు దాడిచేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు. అయినాపురం శివారు గోదావరి ఒడ్డున కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకువని వారి నుంచి రూ2100 నగదు, ఒక కోడిపుంజు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసినట్టు సీఐ మోహన్‌కుమార్ తెలిపారు.

సాగునీటి సంఘం డైరెక్టర్ సుబ్బరాజు మృతి



పి.గన్నవరం, జూలై25(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సాగునీటి సంఘం డైరెక్టర్, ఆర్.ఏనుగుపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేటుకూరి సుబ్బరాజు శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సుబ్బరాజు మృతదేహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ ఫౌండేషన్ పాఠశాలల్లో

విద్యార్థులు కరువు

● ప్రైవేటు విద్యపై మోజు
● విద్యార్థులు లేకపోయినా వసతుల కల్పన తప్పడంలేదు


వెలగతోడులో ఒక్క విద్యార్థికే పాఠాలు బోధిస్తున్న టీచర్

మండపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఫౌండేషన్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు లేక వెళవెళబోతున్నాయి. ప్రైవేటు విద్య మోజులో పడి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేందుకు ముందుకు రావటంలేదు. మండపేట మండలంలో వున్న ఫౌండేషన్ పాఠశాలలు 15 వరకు ఉన్నాయి. ఇవన్నీ సింగిల్ టీచర్ పాఠశాలలే. ఈ పాఠశాలల్లో 1 నుంచి 2తరగతులు మాత్రమే ఉంటాయి. ఇక్కడ చదువుకునే విద్యార్థి ఒక్కరున్నా సరే ఒక ఉపాధ్యాయుడుతోపాటు, ఒక ఆయా, వంటచేసే మనిషి ఉంటారు. మండపేట మండలంలో తాపేశ్వరం లాకులు వద్దవున్న ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. అలాగే వెలగతోడులో కూడా సింగిల్ విద్యార్థి ఒక టీచర్ ఉన్నారు. ఇక ఏడిద గ్రామపంచాయతీ పరిధిలోగల కొత్తపేట కాలనీలోవున్న పాఠశాలలో కేవలం ముగ్గురు మాత్రమే విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ సింగిల్ టీచర్‌తోపాటు వంట చేసేందుకు ఒకరు, ఆయా ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. ఇలా సింగిల్ ఉపాధ్యాయులు ఉన్నచోట కనీసం విద్యార్థులు లేకపోయినా ప్రభుత్వం మాత్రం వసతులు కల్పించక తప్పటంలేదు.

నేడు చెల్లూరులో ఆర్థికమంత్రి కేశవ్ పర్యటన


చెల్లూరులో మహిళా శక్తి సంఘం శంకుస్థాపన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో నేడు శనివారం చెల్లూరులో గ్రామంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం 9గంటలకు మండపేట నుంచి ఆర్థిక మంత్రి చెల్లూరు చేరుకుని రూ.40లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయం-3 భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.90లక్షలతో నిర్మించనున్న పంచాయతీ రాజ్ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన, రూ.కోటి 31లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు, రూ.69 లక్షలతో నిర్మించే మహిళాశక్తి భవనానికి శంకుస్థాపన, రూ.86.40లక్షలతో చేపట్టిన ఇంటింటికీ మంచినీటి కుళాయి పథకం ప్రారంభిస్తారన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని, అనంతరం స్థానిక రైతు భవనంలో జరిగే సభలో పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో మహిళాశక్తి సంఘం భవన శంకుస్థాపన ప్రాం తాన్ని, మంత్రి పర్యటించే ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో ఎస్. కీర్తి స్పందన, మాజీ సర్పంచ్ నూనె ఏసుబాబు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, ఓబిలినేని మనిష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కపిలేశ్వరపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నేలటూరు గ్రామంలో ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జల్‌జీవన్ మిషన్ గ్రాంటు రూ.66.62లక్షలతో నిర్మించిన 60వేల లీటర్ల సామర్థం గల వాటర్ ట్యాంకును, 2500 మీటర్ల మేర హెచ్‌డీపీఈ పైప్‌లైన్లు, 250 ట్యాప్ కనెక్షన్‌లకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ 4.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనతో రాష్ట్రానికి భరోసా

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనతో రాష్ట్రానికి భరోసా వచ్చిందని రాష్ట్రంలో పెట్టుబడులు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మండల పరిధి గంటి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, చీకరమిల్లి లోవరాజు, గుబ్బల మూర్తి, దూనబోయిన నారాయణరావు, ముత్యాల రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆత్రేయపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ కరుటూరి నరసింహరావు అన్నారు. శుక్రవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా అంకంపాలెం సంజీవినినగర్‌లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ముత్తాబత్తుల రాజు, ఎం.మోషన్, యాళ్ళ అరుణ, పులిదిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

రాయవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం చాలా వరకు ఏడాది కాలంలోనే నేరవేర్చిందన్నారు. గ్రామంలో ఇంటింటికీ పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు


వాడపల్లిలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీసీ, ఇంజనీరింగ్ అధికారుల బృందం

ఆత్రేయపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, దేవదాయశాఖ డీఈ ఉదయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. క్యూలైన్లవద్ద టాయిలెట్లు, కంపార్ట్‌మెంట్లు పనులను పరిశీలించి సూచనలు అందజేశారు. విస్తరించిన క్యూలైన్లవద్ద ఫ్యాన్లు, కూలర్లను అమర్చారు. రావులపాలెం వద్ద నిర్మిస్తున్న స్వాగత ద్వారాన్ని పర్యవేక్షించారు. భక్తులకు చికిత్స అందించే మెడికల్‌క్యాంపులో అదనపుబెడ్లను ఏర్పాటు చేశారు.

వర్షాకాలంలో వాహనాలు అప్రమత్తంగా నడపాలి

● ఎంవీఐ శ్రీనివాస్



వాహనాలు రహదారిపై నిలిచిన నీటిలో ప్రయాణిస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల చిత్రం


మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాస్

రావులపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎంవీఐ ఓ.శ్రీనివాస్ అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కురుస్తున్న సమయంలోను, రహదారిలో నీరు ఉన్న ప్రదేశాలలోను వాహనాలు నడుపుతున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రధానంగా వర్షం కురుస్తున్న సమయంలో వాహనం పరిమితి వేగంతో నడపడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యపడుతుందన్నారు.వాహనం గమ్యస్థానానికి 100 మీటర్ల దూరం ఉండగానే వేగం తగ్గించడం ద్వారా సడన్ బ్రేకులు అవసరం లేకుండా వాహనాన్ని నిలుపదల చేయగలుగుతారన్నారు.

ఆక్వాప్లేవింగ్ ...

రహదారిపై ఉన్న నీటిలో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. నీటి ఉపరితలంపై వాహనాన్ని నడిపేటప్పుడు స్టీరింగ్ పట్టు కోల్పోయినట్లు గమనిస్తే వాహనం ఆక్వాప్లేవింగ్ గురైందని గమనించాలన్నారు. ఎక్స్‌లేటర్ తగ్గించాలి. బ్రేక్ వేయకూడదు. స్టీరింగ్ యథాస్థితికి వచ్చిందని తెలిసేవరకూ వేగాన్ని పెంచకూడదు. రహదారిపై నిలిచి ఉన్న నీటిలో వాహనం నడిపేటప్పుడు రహదారికి టైరుకు మధ్యలోకి నీరు చేరుతుంది. సరదా కోసం ఆ నీటిలో వేగంగా వెళితే ప్రమాదాలకు గురవుతారు. వాహనాన్ని కంట్రోల్ చేయ డం కూడా కష్టతరమవుతుంది. రహదారిపై నీరు ఉన్న ప్రదేశాలలో వాహనాన్ని నడపాల్సి వచ్చినప్పుడు వేగాన్ని పూర్తిగా తగ్గిం చి నడపడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు. అలాగే రహదారిపై నీటిలోతును కూడా గమనించుకోవాలి. వర్షాకాలంలో మీరు నడిపే వాహనాన్ని అన్నీ తనిఖీ చేసుకోవాలి. పూర్తిగా అరిగిన టైర్లు కాకుండా బటన్ ఉన్న టైర్లు వినియోగించుకోవాలి. టైర్లలో గాలిని మాన్యువల్ ప్రకారం నింపుకోవాలి. బ్రేకులు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలి. వైపర్ బ్లేడ్లు, వైపర్‌కు అందించేవాటర్ సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. వాహనంలోపల అద్దాలకుమంచులా పట్టకుండా ఉండేందుకు వాహన ఏసీ పనిచేసే విధంగా చూసుకోవాలి. హెడ్‌లైట్లు, సిగ్నల్‌లైట్లు పరిశీలించుకోవాలన్నారు.

ఏపీఎన్జీవో ఉద్యోగులు సభ్యులుగా చేరండి

కొత్తపేట, జూలై25(ఆంధ్రజ్యోతి): కొత్తపేట తాలుకా యూనిట్‌లోని కొత్తపేట, రావులపాలెం, పి.గన్నవరం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో పనిచేస్తున్న ఏపీ ఎన్జీవో ఉద్యోగులందరూ సంఘ సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలని ఏపీ ఎన్జీవో కొత్తపేట యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు పిలుపునిచ్చారు. త్వరలో ఏపీ ఎన్జీవో తాలుకా యూనిట్ కార్యవర్గఎన్నికలు జరుగుతాయని సంఘంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు


కోటలో ప్రత్యేక అలంకరణలో ధాన్యలక్ష్మి అమ్మవారు

రాయవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి దుర్గా అష్టోత్తర, సహస్రనామాలతో మహిళలచే సామూహిక కుంకుమార్చనలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యం లో భారీ అన్న సమారాధన జరిపారు. ఈకార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధు లు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బి.రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి భక్తులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు:
శ్రావణశుక్రవారం పురస్కరించుకుని మండలంలోని అమ్మవారి ఆలయాలు, శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటడాడాయి. రాయవరం పార్వతి సమేత రాజేశ్వరస్వామి ఆలయం, అన్నపూర్ణ సమేత కాశీవిశేశ్వరస్వామి ఆలయం, శ్రీపోలమ్మ అమ్మవారి ఆలయం, సోమేశ్వరం బాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి,అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాణిక్యాంబకు ప్రత్యేక అలంకరణ
ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ద్వాదశ శక్తి పీఠంగా వెలుగొందుతున్న మాణిక్యాంబ అమ్మవారికి శ్రావణమాసం పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేశారు. గజమాలలతో అమ్మవారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకున్నారు.


ఆత్రేయపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కె.గంగవరం: శ్రావణమాసం తొలి శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రావణశుక్రవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు తమ స్వగృహాలలో పిండి వంటలు తయారు చేసుకుని అమ్మవారికి నైవేద్యంపెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గంగవరం-కోటిపల్లి రహదారిలో కోట వద్దఉన్న ధాన్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహిళలు శ్రావణ శుక్రవారం పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

లక్ష్మీదేవికి కుంకుమ పూజలు
ఆత్రేయపురం: ఆత్రేయపురం శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శ్రీలక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం తొలిశుక్రవారం అమ్మవారికి విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకమ పూజలను నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజబాబునగర్‌లో వైసీపీ నాయకుల పర్యటన

రామచంద్రపురం(ద్రాక్షారామం),జూలై25(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణం 5వ వార్డు రాజబాబునగర్‌లో శుక్రవారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో కూటమి మోసపూరితంగా వాగ్దానాలు చేసి ప్రజలను మోసగించిందని సూర్యప్రకాష్ వివరించారు. కార్యక్రమంలో పట్టణ వైసీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, 5వ వార్డు కౌన్సిలర్ అమలదాసు లోవరాజు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పీ4 కార్యక్రమంపై సీఎం వీడియో కాన్ఫరెన్స్


పి.4 పథకంపై సీఎం చంద్రబాబు శుక్రవారం నిర్వహించిన వీసీ కార్యక్రమంలో హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల, అధికారులు

మండపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం పి.4 కార్యక్రమంపై అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్, మండల అధికారులతో కలిసి హాజరయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వీసీకి హాజరై పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సీఎం పలు సూచనలు చేశారు. ఎంపీడీవో సత్యనారా యణమూర్తి, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో దాసరిశ్రీనివాస్ పాల్గొన్నారు.

సహకార సంఘాలు రైతు శ్రేయస్సుకు పాటుపడాలి

● కొత్తపేట ఎమ్మెల్యే బండారు


గంటి సొసైటీ త్రిసభ్య కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ప్రతినిధులుగా నియమితులైన త్రిసభ్య కమిటీ రైతు శ్రేయస్సుకు పాటుపడాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మండల పరిధి గంటి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా చీకరమిల్లి లవరాజు, సభ్యులుగా చొల్లంగి సత్యనారాయణ, పత్తి గౌరీసత్యనారాయణ మూర్తి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని వారిని అభినందించారు. కార్యక్రమంలో ముదునూరి పేర్రాజు, కంఠంశెట్టి శ్రీను, గనిశెట్టి వీరేష్, గుబ్బల మూర్తి పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

రావులపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వైద్య సేవలు పొందిన పేద ప్రజలకు అండగా సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని 18 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.13,54,863లు చెక్కులను బాధితులకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కూటమినాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

కె.గంగవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సేం ద్రియ వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కలిగించి వాటివలన కలిగే ప్రయో జనాలు తెలియజేసి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ రామచంద్ర పురం ఏడీఏ బి.నాగకుమార్ అన్నారు. శుక్ర వారం ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయశాఖ వీఏఏలు, ఆర్టికల్చర్ వీఏఏలకు శిక్షణలో భాగంగా దంగేరులో 20 సెంట్లు భూమిలో సేంద్రి య విధానంలో పలు రకాల కూరగాయల పంటలు పండించే విధానాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయానికి మూలాధారమైన ఘన జీవా మృతం, ద్రవ జీవామృతం తయారు చేయు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మండ ల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి, జిల్లా వనరుల కేంద్రం ఏవో మనోహర్, రామచంద్రపురం ఏవో మణిదీప్, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, హెచ్‌వో అనూష పాల్గొన్నారు.


దంగేరులో సేంద్రియ పద్ధతుల్లో మొక్కలు నాటే కార్యక్రమం పై వీఏఏలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు

ఆలమూరు, జూలై25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కుట్టుశిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. ఆలమూరు మండలం చొప్పెల్లలో జరుగుతున్న కుట్టుశిక్షణను శుక్రవారం పరిశీలించారు. కుట్టు శిక్షణలో ఉన్న నైపుణ్యత మెళకువలను నేర్చుకుని శిక్షణ తీసుకోవాలని ఆయన సూచించారు. సక్రమంగా నేర్చుకున్న వారికి మంచి ఆదాయ మార్గాలు ఏర్పడతాయన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం అందించే కుట్టు మిషన్లు అందిస్తామ ని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డీవో రాజు సూచించారు.


చొప్పెల్లలో జరుగుతున్న కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

మండపేట ఎస్ఐగా రాము



మండపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణ ఎస్.ఐగా ఎన్. రాము బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్.ఐగా పనిచేసిన ఎస్.ఐ చంటి రావులపాలెంనకు బదిలీ అయ్యారు. ఇక్క డకు వచ్చిన రాము గతంలో మారేడుమిల్లి, కాకినాడ సీసీఎస్. రాజమహేంద్రవరం త్రీ టౌన్‌తోపాటు రావులపాలెం ఎస్.ఐగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. పట్టణంలో శాంతిభద్రతలు ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

రావులపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్టుకు సంబంధించి అతిథి అధ్యాపకపోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజిక్స్ సబ్జెక్టు పీజీలో 55 మార్కులు సాధించి ఉండాలన్నారు. అభ్యర్థుల దరఖాస్తులను ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటలలోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. 31వ తేదీ ఉదయం 11 గంటల నుంచి కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7995875308, 9949135863కు సంప్రదించాలన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా 'తోరం'



కపిలేశ్వరపురం, జూలై25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని అంగర గ్రామానికి చెందిన తోరం నియమితులయ్యారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తన నియామకంపట్ల జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమ, మండపేట నియోజకవర్గం అధ్యక్షుడు కేవీవీ సాయిరాం, కోన సత్యనారాయణ, పి.వసంతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడిగా తోరం పనిచేశారు.

'టీబీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి'


చింతలూరులో టీబీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆలమూరు, జూలై25(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా టీబీపై అవగాహన పెంచుకోవాలని ఆలమూరు మండలం పెదపళ్ల వైద్యుడు సాయికిషోర్ సూచించారు. ఆలమూరు మండలం చింతలూరులో టీబీ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు ముందుగా గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు. ఈవ్యాధి పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అక్కుల రాజా, సూపర్‌వైజర్లు కెఎస్‌వి.రమణ, శ్రీనివాసరావు, పలువురు ఏఎన్ఎంలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వెలగతోడులో క్షీణించిన పారిశుధ్యం

● రోగాలబారిన పడుతున్న ప్రజలు


వెలగతోడు గ్రామానికి వెళ్లే రోడ్డులో చెత్తకుప్పలు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మండపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగతోడులో పారిశుధ్యం క్షీణించింది. ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఇక్కడ శానిటేషన్‌పై పంచాయతీ పర్యవేక్షణ లేకపోవటం పాలకులు పట్టించుకోకపోవటంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఇక్కడ డ్రైన్‌లు అధ్వానంగా దోమలుపెంపక కేంద్రాలుగా మారాయి. కనీసం ఇక్కడ దోమల మందు చల్లిన దాఖలాలు ఏమీలేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలే వానాకాలం కావటంతో దోమలుభారిన పడి ఆసుపత్రి పాలవ్వాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఫిర్యాదు చేసినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవటంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మరోపక్క గ్రామంలో వచ్చిన చెత్తను మురుగు డ్రైన్‌లో పోయటంవల్ల మురుగునీరు పారేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.